దిగుమతులే దిక్కు!

- తిండి కోసం దిక్కులు చూసే దుస్థితికి దేశం
- అమాంతంగా పడిపోయిన చక్కెర ఉత్పత్తి
- వచ్చే సంవత్సరం ఇతర దేశాల నుండి దిగుమతిపైనే ఆధారం!
- ఇప్పటికే గోధుమ, కంది పప్పు, వంట నూనెను దిగుమతి చేసుకొంటున్న భారత్
- నిరుడి కంటే 13 శాతం తగ్గిన బియ్యం సేకరణ

ఆర్థిక సంవత్సరం	దేశంలో చక్కెర ఉత్పత్తి (మిలియన్ టన్నులు)
2022-23	33.1
2023-24	29.05
2024-25	26.6

ఆధారం: రాయిటర్స్ నివేదిక

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ప్రపంచ దేశాలకు ఆహారోత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి దేశాన్ని తీసుకుపోతామని గప్పాలు కొట్టిన బీజేపీ సర్కారు.. గడిచిన పదేండ్లలో ఆకలి భారతాన్ని మిగిల్చింది. నిత్యావసర వస్తువుల కోసం విదేశాల వైపు దీనంగా చూసే దుస్థితిని తీసుకొచ్చింది. ఉల్లి, గోధుమ, కందిపప్పు, వంట నూనె సహ అనేక ఆహారోత్పత్తులను దిగుమతి చేసుకోవాల్సిన దుర్భర పరిస్థితులు నేడు దాపురించాయి. ఇప్పుడు ఈ జాబితాలోకి చక్కెర కూడా చేరింది.

ఉత్పత్తి అథఃపాతాళానికి

చక్కెర ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్ ఇప్పుడు అదే చక్కెర కోసం విదేశాలపై ఆధారపడాల్సిన దురవస్థ దాపురించింది. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వెరసి మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లో ఈ ఏడాది చెరుకు పంట దిగుబడి భారీగా తగ్గినట్టు పారిశ్రామికవర్గాలు పేర్కొన్నాయి. కిందటేడాదితో పోలిస్తే పంట దిగుబడి 12 శాతం (25 లక్షల టన్నులు) తగ్గినట్టు రైతులు చెబుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఉత్పత్తిలో క్షీణత మరింత పెరుగొచ్చని అంచనా. దీంతో ఏడేండ్లలో తొలిసారిగా చక్కెర ఎగుమతులపై ఇటీవల నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం ఆంక్షలను అలాగే కొనసాగించే యోచనలో ఉన్నది. ఇదే సమయంలో రానున్న పండుగ సీజన్‌లో చక్కెర కొరత రాకుండా ఉండేందుకు బ్రెజిల్ నుంచి చక్కెరను దిగుమతి చేసుకోవడానికి సంప్రదింపులు కూడా మొదలుపెట్టినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా, కేంద్ర సర్కారుకు ముందుచూపు లేకపోవడంతోనే దేశంలో చక్కెర కొరత ఏర్పడిందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

నిత్యావసరాలూ అలాగే..

ఇటీవల పెరిగిన ఉల్లి ధరలను నియంత్రించడానికి వాటి ఎగుమతులపై 40 శాతం మేర భారీ సుంకాన్ని కేంద్రప్రభుత్వం విధించింది. గత జూన్‌లో టమాటా ధరలు భగ్గుమన్నాయి. దీంతో టమాటా ధరలకు కళ్లెం వేయలేకపోయిన కేంద్రం.. చివరకు నేపాల్‌ను ఆశ్రయించింది. దిగుమతులకు తలుపులు బార్లా తెరిచింది. ఇక, గోధుమ ధరలను నియంత్రించడానికి రష్యా సాయం తీసుకొంటున్నది. 2017 తర్వాత భారత్ గోధుమలను దిగుమతి చేసుకోవడం ఇదే మొదటిసారి. దేశంలో కందిపప్పు కొరత అంతకంతకూ పెరుగుతున్నది. కిలో రూ. 200 దాటిన పప్పు ధరను చూసి సామాన్యులు లబోదిబోమంటున్నారు. దీంతో ధరలను అదుపుచేయడానికి తూర్పు ఆఫ్రికా దేశం మొజాంబిక్, మయన్మార్ నుంచి టన్నులకొద్దీ కందిపప్పును భారత్ దిగుమతి చేసుకొంటున్నది. వంటనూనె కోసం ఇండోనేషియా మీద ఆధారపడుతున్నది.

బియ్యం సేకరణ అంతంతమాత్రమే!

దేశీయంగా నిల్వలు తగ్గిపోతుండటంతో బియ్యం ఎగుమతులపై కేంద్రం ఇప్పటికే నిషేధం విధించింది. అయితే, కొరతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యామ్నాయ చర్యలను మాత్రం చేపట్టలేదు. దీంతో వరి ధాన్యం ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఫలితంగా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సేకరించే బియ్యం కిందటేడాదితో పోలిస్తే 12.7 శాతం తగ్గింది. గత వానాకాలం 279.38 లక్షల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ సేకరించగా, ఈసారి 243.85 లక్షల టన్నులకే అది పరిమితమైంది. దీంతో విపణిలో బియ్యం ధరలు మరింత పెరిగే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

10 మందిలో ఒక్కరికే జాబ్!

- ఈ ఆర్థిక ఏడాది 15 లక్షల ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో 10% మందికే ఉద్యోగాలు
- 45 శాతం మందిలోనే ఇండస్ట్రీ స్కిల్స్
- ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం
- ఐటీ కంపెనీల్లో తగ్గిన ఫ్రెషర్ల హైరింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: దేశంలో ఏటా లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసుకుని కళాశాలల నుంచి బయటకు వస్తున్నారు. అయితే వారిలో కనీసం 20 శాతం మందికి కూడా ఉద్యోగం దొరుకుతుందన్న గ్యారంటీ లేకుండా పోయింది. ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉందని, 15 లక్షల మంది గ్రాడ్యుయేట్లలో కేవలం 10 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనం పేర్కొన్నది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఐటీ కంపెనీల్లో ఈ సారి ఫ్రెషర్ల నియామకాల సంఖ్య 35-40 శాతం పడిపోయిందని ఐటీ, ఇంజినీరింగ్, ఎడ్‌టెక్ తదితర రంగాల్లో టెక్నాలజీ స్టాఫింగ్ సేవలు అందించే 'టీమ్‌లీజ్ డిజిటల్' తెలిపింది.

1.6 లక్షల మందికే ఉద్యోగాలు

2022-23 ఆర్థిక సంవత్సరంలో 2.3 లక్షల మంది ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఉద్యోగాలు పొందారని టీమ్‌లీజ్ డిజిటల్ పేర్కొన్నది. అయితే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య భారీగా పడిపోతుందని, కేవలం 1.6 లక్షల మంది ఫ్రెషర్లు మాత్రమే రిక్రూట్ అయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఇటీవలి కాలంలో కంపెనీల యాజమాన్యాలు ఫ్రెషర్లకు ఆర్నెల్లు ట్రైనింగ్ ఇచ్చి నియమించుకోవడం కంటే 7-12 ఏండ్ల అనుభవం ఉన్న వారిని రిక్రూట్ చేసుకొనేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయని టీమ్‌లీజ్ డిజిటల్ బిజినెస్ హెడ్ క్రిష్ణ విజ్ అన్నారు. గత రెండేండ్లుగా ప్రపంచ దిగ్గజ కంపెనీలు భారీగా ఉద్యోగులను తొలగిస్తున్న నేపథ్యంలో అమెరికా, ఇతర దేశాల నుంచి టెకీలు దేశ ఉద్యోగ రంగంలోకి వచ్చారు. ఇది దేశంలోని ఉద్యోగార్థులపై ప్రభావం చూపుతుందనే వాదనలు కూడా ఉన్నాయి.

ప్రత్యామ్నాయ రంగాల్లో డిమాండ్

ఉద్యోగాలు పొందేందుకు అభ్యర్థికి సంబంధిత రంగానికి చెందిన నైపుణ్యాలు ఉండటం కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో మొత్తం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో కేవలం 45 శాతం మందిలో మాత్రమే పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలు ఉన్నాయని క్రిష్ణ విజ్ పేర్కొన్నారు. అయితే ఇదే సమయంలో ఇంజినీరింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న టెక్‌యేతర రంగాలైన బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, మీడియా, రిటైల్, కన్జ్యూమర్ బిజినెస్, లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్, ఎనర్జీ రంగాల్లో డిమాండ్ ఏర్పడుతున్నదని, ఫ్రెషర్ల నియామకాలను పెంచుతున్నాయని అన్నారు. నేటి ప్రపంచంలో రోజురోజుకు వస్తున్న మార్పుల కారణంగా కంపెనీలు ఉద్యోగార్థుల నుంచి టాలెంట్‌తో పాటు కమ్యూనికేషన్, టీమ్ వర్క్, సాంకేతిక నైపుణ్యం వంటివి సాఫ్ట్ స్కిల్స్‌ను కూడా ఆశిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగార్థులు నిరంతరం స్కిల్స్ నేర్చుకోవడంపై ఆసక్తి పెంచుకోవాలని, డాటా సైన్సెస్, ఏఐ, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతికతల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకొంటూ ఉండాలని సూచించారు.

ఉద్యోగాలు పొందిన ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు

సంవత్సరం	సంఖ్య	శాతం
2018-19	1.5 లక్షలు	10%
2019-20	2.8 లక్షలు	19%
2020-21	90 వేలు	6%
2021-22	4 లక్షలు	26%
2022-23	2.2 లక్షలు	15%
2023-24	1.6 లక్షలు(అంచనా)	10%

అమెరికాలోనే హెచ్1బీ వీసాల రెన్యువల్

- పైలట్ ప్రోగ్రామ్‌కు 'వైట్ హౌస్' ఓఐఆర్ఏ ఆమోదం
- తొలుత 20 వేల మంది వీసాల పునరుద్ధరణ
- దీంతో భారతీయ టెక్ నిపుణులకు ప్రయోజనకరం

వాషింగ్టన్, డిసెంబర్ 19: అమెరికాలో పనిచేస్తున్న విదేశీ టెక్ నిపుణులకు శుభవార్త. ఇకపై వారు హెచ్1బీ వీసాల పునరుద్ధరణ కోసం స్వదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. అమెరికాలోనే వాటిని రెన్యువల్ చేసుకోవచ్చు. ఇందుకు వీలుకల్పించే పైలట్ ప్రోగ్రామ్‌కు అమెరికా అధ్యక్ష భవనం 'వైట్ హౌస్' ఆధ్వర్యంలోని ఉన్నతస్థాయి నియంత్రణ సంస్థ ఓఐఆర్ఏ (ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ రెగ్యులేటరీ ఎఫైర్స్) ఈ నెల 15న ఆమోదం తెలిపింది. మూడు నెలలపాటు అందుబాటులో ఉండే ఈ పైలట్ ప్రోగ్రామ్ కింద తొలుత 20 వేల మంది విదేశీయులకు హెచ్1బీ వీసాలను రెన్యువల్ చేస్తారు. దీంతో అమెరికాలో పనిచేస్తున్న ఎంతో మంది భారత టెక్ నిపుణులకు లబ్ధి చేకూరుతుంది. అమెరికాలో పనిచేసే విదేశీ ఉద్యోగులకు హెచ్1బీ వీసా తప్పనిసరి. ఇప్పటివరకు ఈ వీసాలు పొందినవారు వాటిని పునరుద్ధరించుకునేందుకు స్వదేశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పైలట్ ప్రోగ్రామ్ ద్వారా అమెరికాలోనే హెచ్1బీ వీసాల రెన్యువల్‌కు వీలుకల్పించడంతో విదేశీయులు తమ వీసాల పునరుద్ధరణ కోసం స్వదేశాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

బియ్యం ధరల్ని తగ్గించండి

రైస్ ప్రాసెసింగ్ పరిశ్రమకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 19: మరికొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో.. బాస్మతీయేతర బియ్యం ధరల్ని తగ్గించే అంశంపై మంగళవారం కేంద్రం కీలక సమావేశం నిర్వహించింది. బియ్యం ధరలు తగ్గించాలని రైస్ ప్రాసెసింగ్ పరిశ్రమ ప్రతినిధులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. తగ్గించిన ధరలు వెంటనే అమల్లోకి రావాలని పరిశ్రమ వర్గాలకు జారీచేసిన ఆదేశాల్లో కేంద్రం పేర్కొన్నది. ఆహారం, ప్రజా పంపిణీ శాఖ కేంద్ర కార్యదర్శి సంజీవ్ చోప్రా బాస్మతీయేతర రైస్ ప్రాసెసింగ్ పరిశ్రమకు చెందిన ముఖ్య ప్రతినిధులతో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. బియ్యం రిటైల్ ధరల్ని సమీక్షించాలని, వాటి ధరల్ని సరైన స్థాయికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రతినిధులను ఆదేశించారు. ఈ అంశాన్ని తమ యూనియన్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లాలని ఇండస్ట్రీ అసోసియేషన్స్‌కు నిర్దేశించారు. ఖరీఫ్ దిగుబడి ఆశించిన విధంగా ఉన్నప్పటికీ దేశీయ మార్కెట్‌లో బాస్మతీయేతర బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయన్నది సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. టోకు వ్యాపారులు, రిటైలర్స్ లాభాల మార్జిన్ భారీగా పెరిగిన సంగతి ప్రస్తావనకు రాగా, దీనిని వెంటనే నియంత్రించాలని పరిశ్రమ ప్రతినిధులను కేంద్రం ఆదేశించింది. బియ్యం ఎంఆర్‌పీకి, రిటైల్ ధరల మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉందని, దీనిని సరిచేస్తే బియ్యం ధరలు తగ్గేందుకు అవకాశముందని సమావేశంలో పలువురు పేర్కొన్నారని తెలిసింది.

చైనాలో భూకంపం..127 మంది మృతి

బీజింగ్/జిషిషాన్, డిసెంబర్ 19: చైనాలో భారీ భూకంపం సంభవించింది. 127 మంది మరణించారు. 700 మందికిపైగా గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి గాన్సూ, కిన్‌ఘై రాష్ట్రాల్లో ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 6.2గా నమోదైంది. దాదాపు 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం కేంద్రీకృతమైంది. గాన్సూ రాష్ట్రంలోనే 113 మంది మరణించగా, కిన్‌ఘై రాష్ట్రంలో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. 1.5లక్షలకు పైగా ఇండ్లు దెబ్బతిన్నాయి. పసుపు నదిపై నిర్మించిన బ్రిడ్జికి పగుళ్లు వచ్చాయి. రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి సహాయ చర్యలు చేపడుతున్నారు.

భూకంపం కారణంగా గాన్సూ రాష్ట్రంలో కుప్పకూలిన ఇంటి కింద ఎవరైనా ఉన్నారేమోనని వెతుకుతున్న సహాయ సిబ్బంది

మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న ఆలిండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి ప్రతినిధులు

దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలి

ఆలిండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): దళిత ముస్లింలకు గతంలో ఉన్న ఎస్సీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని 'ఆలిండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ పోరాట సమితి' డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సమితి ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. 1950 వరకు ఉన్న ఎస్సీ రిజర్వేషన్‌ను 1950 నుంచి తొలగించారని సమితి ప్రతినిధులు చెప్పారు. 1956లో దళిత సిక్కులకు, 1990లో దళిత బౌద్ధులకు తిరిగి ఎస్సీ హోదా కల్పించారని గుర్తు చేశారు. దీనిని దళిత ముస్లింలు, దళిత క్రైస్తవులకు వర్తింపజేయాలని జస్టిస్ రాజేందర్ కమిటీ, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారసు చేసినా కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎస్సీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ 2009లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు షేక్ సత్తార్ సాహెబ్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఇస్లాముద్దీన్, మాదిగ జేఏసీ అధ్యక్షుడు పిడమర్తి రవి, ఖలీల్ అహ్మద్, అబ్దుల్ అహ్మద్, మీర్ ఫహద్ అలీ, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి కోల్‌కతాలో ఏఐఎస్‌జీఈఎఫ్ సమావేశాలు

టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఈ నెల 28 నుంచి 30 వరకు అఖిల భారత ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) సమావేశాలు కోల్‌కతాలో జరుగనున్నాయని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ వెల్లడించారు. సభల సన్నాహక సమావేశం హైదరాబాద్‌లో ఆయన అధ్యక్షతన మంగళవారం జరిగింది. రాష్ట్రం నుంచి 105 మంది ప్రతినిధులు ఈ సభలకు హాజరుకానున్నట్టు తెలిపారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల రాజేందర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్‌లను ఒకే జిల్లాకు కేటాయించాలి: ఎస్జీటీయూ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): స్పౌజ్‌లను ఒకే జిల్లాకు కేటాయించాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్జీటీయూ) నేతలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంను యూనియన్ నేతలు కలిసి వేర్వేరుగా వినతిపత్రాలను అందజేశారు. పరిశుభ్రతకు సర్వీస్‌పర్సన్స్‌ను నియమించాలని, మేజర్ పంచాయతీలలో ఆదర్శ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులందరికీ రెండు జతల యూనిఫామ్‌తోపాటు బూట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం, వనం వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థలకే సంపూర్ణ అధికారాలివ్వాలి

మున్సిపల్ చాంబర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థలకే సంపూర్ణ అధికారాలు ఇవ్వాలని మున్సిపల్ చాంబర్స్ అసోసియేషన్ చైర్మన్ రాజు వెన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 మున్సిపల్ చట్టం వల్ల ప్రజాప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారని తెలిపారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు ఇచ్చిన విశేష అధికారాలను రద్దు చేయాలని, ప్రత్యక్ష పద్ధతిలో చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీసీ కెమెరా.. సూపర్ పోలీస్!

- సీసీ కెమెరాల ఆధారంగా 18,234 కేసుల ఛేదన
- రాష్ట్రంలో 10.25 లక్షల కెమెరాలు
- సురక్షిత నగరంగా హైదరాబాద్
- తక్కువ కేసుల నమోదులో కోల్‌కతా, పుణె తర్వాత మనదే
- రాష్ట్రంలో 48.47% పెరిగిన సైబర్ నేరాలు
- తొలిసారిగా ఎస్సీఆర్బీ నివేదిక
- 'క్రైమ్ ఇన్ తెలంగాణ-2022' పుస్తకాన్ని ఆవిష్కరించిన డీజీపీ

రాష్ట్రంలో వివిధ రకాల నేరాల పెరుగుదల ఇలా..

సైబర్ నేరాలు	48.47%
ఆర్థిక నేరాలు	41.37%
వివిధ రకాల మోసాలు	43.30%

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల సహాయంతో 18,234 కేసులను పోలీసులు సులువుగా ఛేదించారని స్టేట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎస్సీఆర్బీ) తెలిపింది. ఒక్క 2022లోనే రాష్ట్రవ్యాప్తంగా 1,74,205 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. ప్రస్తుతం తెలంగాణలో 10,25,849 సీసీ కెమెరాలు ఉన్నాయని పేర్కొన్నది. 2021 సంవత్సరంతో పోలిస్తే 2022లో సైబర్ నేరాలు 48.47%, ఆర్థిక నేరాలు 41.37%, వివిధ రకాల మోసాలు 43.30% పెరిగాయని వెల్లడైంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా 'క్రైమ్ ఇన్ తెలంగాణ-2022' పేరిట సీఐడీ ఏడీజీ మహేశ్‌భగవత్ రూపొందించిన పుస్తకాన్ని డీజీపీ రవిగుప్తా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ఈ పుస్తకం అందించిన విలువైన సమాచారం నేరాలను అదుపు చేసే వ్యూహాలను, చట్టాలను రూపొందించడంలో కీలకంగా పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ పోలీసులు నేరపరిశోధనలో సైంటిఫిక్ టూల్స్, ఫోరెన్సిక్ సైన్స్, సైబర్ టెక్నాలజీని సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగిస్తున్నట్టు వెల్లడించారు. ఎన్సీఆర్బీ క్రైమ్ ఇన్ ఇండియా-2022 నివేదిక ప్రకారం.. గుర్తించదగిన నేరాలు అతి తక్కువగా నమోదైన మెట్రోపాలిటిన్ నగరాల్లో తెలంగాణకు 3వ స్థానం రావడం సంతోషకరమని చెప్పారు. పట్టణ జనాభాలో కాగ్నిజబుల్ నేరాలు అతి తక్కువగా నమోదైన నగరాల్లో కోల్‌కతా, పుణె, హైదరాబాద్ ఉన్నాయని వివరించారు. మహేశ్‌భగవత్ పర్యవేక్షణలో ఎస్సీఆర్బీ ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు చెన్నయ్య, సర్దార్‌సింగ్, ఇన్‌స్పెక్టర్లు నవీన్‌బాబు, శేఖర్‌రెడ్డి ఈ పుస్తకం రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారని అభినందించారు. కార్యక్రమంలో ఏడీజీలు శిఖాగోయెల్, అభిలాష బిస్త్, సౌమ్యా మిశ్రా, సంజయ్‌జైన్ పాల్గొన్నారు.

మేడిగడ్డ కుంగుబాటుకు రాష్ట్రపతికి సంబంధం ఏమిటి?

- ప్రాజెక్టు భద్రతా వైఫల్యాలపై సీబీఐ ఏం చేస్తుంది?
- కాంగ్రెస్ నేతను ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ జలాశయంలో పిల్లర్ కుంగుబాటు, భద్రతా వైఫల్యాలపై సీబీఐ, కేంద్ర ఎన్నికల సంఘాలు ఏం చేస్తాయని హైకోర్టు పిటిషనర్‌ను నిలదీసింది. ప్రాజెక్టు భద్రత వ్యవహారాలకు సీబీఐకి ఏం సంబంధమని ప్రశ్నించింది. సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేయాల్సింది పోయి రాష్ట్రపతి, ఎన్నికల సంఘం, జాతీయ విపత్తుల నిర్వహణ మండలి, సీబీఐ వంటి సంస్థలకు ఫిర్యాదు చేయడంలో ఆంతర్యం ఏమిటని నిలదీసింది. మేడిగడ్డ రిజర్వాయర్ కుంగుబాటుకు బాధ్యులెవరో తేల్చే దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు జీ నిరంజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం అసలు పిటిషనర్ ఉద్దేశం ఏమిటో చెప్పాలని కోరింది. పిటిషన్‌కు విచారణార్హతపై ప్రభుత్వ వాదన తెలుపాలని అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజనీకాంత్‌రెడ్డిని ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తున్నట్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

టాయిలెట్స్‌కు, సర్కారు మార్పునకు సంబంధమేంది?

- ప్రభుత్వ న్యాయవాదికి హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, డిసెంబర్ 19, (నమస్తే తెలంగాణ): జూనియర్ కళాశాలల్లో టాయిలెట్ల నిర్మాణం, శానిటరీ నాప్కిన్ల ఏర్పాటుకు.. రాష్ట్రంలో ప్రభుత్వం మార్పునకు సంబంధం ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. జూనియర్ కాలేజీల్లో టాయిలెట్లను ఏర్పాటు చేయాలని ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకుండా రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని చెప్పడం సబబు కాదని వ్యాఖ్యానించింది. పూర్తి వివరాలను నివేదించాలని, ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని గుర్తు చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 24కు వాయిదా వేసింది. సరూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 700 మంది విద్యార్థులకు ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉందంటూ ఒక పత్రికలో వచ్చిన వార్త ఆధారంగా మణిదీప్ అనే విద్యార్థి రాసిన లేఖను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో టాయిలెట్లతో పాటు బాలికల కోసం శానిటరీ నాప్కిన్ మెషన్లను ఏర్పాటు చేయాలని గతంలో ఇచ్చిన ఆదేశాల అమలు గురించి వివరించాలని కోరింది. ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ, ప్రభుత్వం మారడంతో గడువు కావాలని కోరడంపై హైకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది. జీవో 111కు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేసిన వ్యాజ్యంపై విచారణ సమయంలో కూడా గడువు కోరడంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది.

క్రూరమృగాల దాడిలో మరణిస్తే 10 లక్షలు

పరిహారాన్ని పెంచిన రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం క్రూరమృగాల దాడిలో బాధితులకు ఇచ్చే పరిహారాన్ని పెంచింది. మరణిస్తే గతంలో రూ.5 లక్షలు ఇస్తుండగా, దానిని రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకొన్నది. ఈ మేరకు రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధితుడికి స్వల్ప గాయాలైతే గతంలో చికిత్స ఖర్చులను మాత్రమే భరించేవారు. ఇకపై రూ.లక్ష వరకు చికిత్స ఖర్చు, రూ.10వేలు పరిహారంగా చెల్లించనున్నట్టు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి పరిహారాన్ని రూ.లక్షకు పెంచి, చికిత్స ఖర్చును రూ.3 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. కాగా, పశువులు మరణిస్తే గతంలో పశువు విలువను పశుసంవర్ధకశాఖ అధికారి గణిస్తే, పరిహారం చెల్లించేవారు. ఇకపై ఆయనతోపాటు అటవీశాఖకు చెందిన సీనియర్ అధికారి, గ్రామ సర్పంచ్ కలిసి విలువ నిర్ణయిస్తారు. గరిష్ఠంగా రూ.50వేలు చెల్లిస్తారు. పంటనష్టానికి గతంలో రూ.6వేలు ఇవ్వగా, ఇకపై రూ.7,500 చెల్లిస్తారు. హార్టికల్చర్ పంటలు ధ్వంసం అయితే రెవెన్యూ శాఖ అధికారులు ఇచ్చే నివేదిక ప్రకారం రూ.7,500 నుంచి రూ.50వేల వరకు ఇచ్చేవారు. ఇకపై పరిహారంలో మార్పు లేకపోయినా, హార్టికల్చర్, రెవెన్యూ అధికారులు పంటనష్టంపై నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

రామానుజన్ అవార్డుకు రమేశ్‌బాబు ఎంపిక



అబిడ్స్, డిసెంబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ గణిత శాస్త్ర విభాగాధిపతి, హెచ్‌వోడీ, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే రమేశ్‌బాబు.. శ్రీనివాస రామానుజన్ ఎక్సలెన్సీ అవార్డు-2023కు ఎంపికైనట్టు తెలంగాణ రాష్ట్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ అక్తర్ అలీ తెలిపారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఈ నెల 22న ఆయనకు అవార్డు బహూకరిస్తామని వెల్లడించారు. 25 ఏండ్లుగా గణితశాస్త్రంలో ఎనలేని కృషి చేస్తున్న ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. ప్రొఫెసర్ బీ లక్ష్మయ్య చేతుల మీదుగా రమేశ్‌బాబు అవార్డు అందుకొంటారని పేర్కొన్నారు.

విమానంలో తిరుపతికి గుండె తరలింపు

- మొదట శ్రీకాకుళం నుంచి హెలికాప్టర్‌లో విశాఖకు.. అక్కడి నుంచి విమానంలో తిరుపతికి
- హైదరాబాద్ బాలికకు తిరుపతిలో అమర్చనున్న వైద్యులు
- ఏపీ సీఎం జగన్ ప్రత్యేక చొరవ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): గుండె ఆపరేషన్ కోసం ఏపీలో గ్రీన్‌చానెల్ ఏర్పాటు చేశారు. మొదట గుండెను శ్రీకాకుళం నుంచి విశాఖకు హెలికాప్టర్‌లో, అక్కడి నుంచి తిరుపతికి విమానంలో తరలించారు. శ్రీకాకుళంలోని రాగోలు జెమ్స్ మెడికల్ కాలేజీలో అవయవదానంలో భాగంగా సేకరించిన గుండెను ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అధికారులు 20నిమిషాల్లోనే హెలికాప్టర్‌లో వైజాగ్‌కు తరలించారు. అక్కడి నుంచి తిరుపతికి విమానంలో తీసుకొచ్చి.. ఎయిర్‌పోర్ట్ నుంచి గుండెను గ్రీన్‌చానల్ ద్వారా పద్మావతి దవాఖానకు తరలించారు. ఈ గుండెను హైదరాబాద్‌లోని వనస్థలిపురం ఎన్జీవో కాలనీకి చెందిన బాలిక లహరి(11)కి వైద్యులు అమర్చనున్నారు. నవంబర్ 6న తిరుపతిలోని చిల్డ్రన్ హార్ట్‌కేర్ సెంటర్‌లో తన కూతురిని చేర్పించినట్టు ఆమె తండ్రి సత్యనారాయణ తెలిపారు.

నవోదయ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): వచ్చే నెల 20న నిర్వహించే నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష హాల్ టికెట్లను అధికారులు వెబ్‌సైట్‌లో ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షను నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు https:// msbadi.com/download-avodaya-6th-class-halltickets లింక్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

22న బంద్‌కు మావోయిస్టుల పిలుపు

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ) : మావోయిస్టు పార్టీతోపాటు, ప్రజలపై కొనసాగుతున్న విచక్షణారహిత సైనిక దాడులను వ్యతిరేకిస్తూ ఈ నెల 22న తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నట్టు జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి వెంకటేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాదిన్నరగా జార్ఖండ్-బీహార్ అడవుల్లోని ఆదివాసీ గ్రామాలు బాంబులతో దద్దరిల్లుతున్నాయని, అక్కడి దాడులను ఖండిస్తూ, వారికి అండగా ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్టు) ప్రజా ఉద్యమాలను అణిచివేయడానికి ప్రత్యేక కమాండో బలగాల దాడులను ఖండించాలని సూచించారు.

'లా' తుదివిడతలో 96% సీట్ల భర్తీ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): లాసెట్, పీజీలాసెట్ తుది విడత కౌన్సెలింగ్‌లో మంగళవారం 96 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 3,447 సీట్లకు 10,375 మంది విద్యార్థులు వెబ్ ఆప్షన్లు ఎంచుకొన్నారు. వీరిలో 3,331 మందికి సీట్లు కేటాయించారు. ఇంకా 116 సీట్లు మిగిలాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో 6,894 సీట్లుండగా 5,912 మంది సీట్లు పొందారు. వీరిలో 3,729 మంది విద్యార్థులు రిపోర్ట్ చేశారు. సీట్లు పొందిన వారు 23లోపు ఫీజు చెల్లించి కాలేజీల్లో రిపోర్ట్‌చేయాలని ప్రవేశాల కమిటీ కన్వీనర్ రమేశ్‌బాబు సూచించారు.

సీట్ల భర్తీ వివరాలు

కోర్సు	సీట్లు	భర్తీ అయినవి
మూడేండ్ల లా	2,120	2,097
ఐదేండ్ల లా	917	793
ఎల్ఎల్ఎం	410	441 (స్లైడింగ్‌వి కలుపుకొని)
మొత్తం	3,447	3,331